సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 9, జనవరి, 2023



పెరటి కోళ్ల పెంపకంతో..

పెరటి కోళ్ల పెంపకం అధిక ఆదాయాన్ని ఇస్తోంది. జిల్లాలో 2500 యూనిట్ల సరఫరాకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. - 8లో



ఉచిత బియ్యంతో భరోసా

ఉచిత బియ్యం అందించాలనే ప్రభుత్వ నిర్ణయం బడుగులకు భరోసా ఇస్తోంది. 6,61,818 కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. - 8లో

ఆలయంలో దొంగలు పడ్డారు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉల్లా నపేట సీతమ్మతల్లి ఆలయంలో దొంగలు పడ్డారు. శనివారం అర్ధరాత్రి ఆలయం తాళాలు పగులగొట్టారు. రెండు హుండీలు, రూ.5వేల నగదు, విలువైన నగదు దోచుకెళ్లిపోయారు. పూజారి ఇప్పిలి మల్లేశ్వరరావు కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్ష



ఎచ్చెర్ల వెంకటేశ్వర పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 పరీక్షలు ప్రశాంతం జరిగాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఏపీపీఎస్సీ సెక్రటరీ హెచ్.అరుణ్ కుమార్ ఉదయం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో 19 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరిగిన పరీక్షలు జరిగాయన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 72.59 శాతం మంది హాజరు కాగా 1535 మంది హాజరు కాలేదని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 72.32 శాతం మంది హాజరు కాగా 1550 మంది హాజరు కాలేదని తెలిపారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ పరీక్ష కేంద్రాల్లో ఆదివారం గ్రూప్‌–1 స్క్రీనింగ్ పరీక్ష సజావుగా జరిగింది. రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు.

గ్రూప్‌–1 పరీక్ష కేంద్రాల తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన గ్రూప్‌–1 పరీక్ష కేంద్రాలను ఎస్పీ జీఆర్ రాధిక తనిఖీ చేశారు. ఉమెన్స్ కాలేజీ, శ్రీ వెంకటేశ్వర కళాశాలతో పాటు పలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సమర్థంగా పరీక్షలు నిర్వహించాలని, ఉదయం, మధ్యాహ్నం పరీక్షల య్యాక పరీక్ష కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున అభ్యర్థులు తప్ప మిగిలినవారెవరూ వీటి ఆవరణలో ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎస్పీతో పాటు సబ్ డివిజనల్ అధికారి మహేంద్ర మతే ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



ట్రైబల్ యూనివర్సిటీ వీసీకి జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదిత్యుడు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చాడు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తగిన ఏర్పాట్లు చేశారు. విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కత్తిమణి స్వామిని దర్శించుకున్నారు. ఏపీ ఎమ్మెల్సీ అనంతబాబు కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సి) బాలానాయక్, స్థానిక జిల్లా ఎస్ఈబీ ఎస్పీ మణికంఠ తదితరులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



నువ్వలరేవు తీరానికి చేరిన తాబేళ్ల కళేబరాలు

వజ్రపుకొత్తూరు రూరల్: సముద్ర జీవుల్లో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. సంతానోత్పత్తి కోసం గుడ్లు పెట్టేందుకు వేల మైళ్ల దూరం నుంచి ఇక్కడి తీరానికి ఇవి వస్తుంటాయి. ఈ తరుణంలో మత్స్యకారులు వినియోగిస్తున్న నిషేధ వలల తాకిడికి అలాగే ఇంజిన్ల తగిలి ఇవి చనిపోతున్నాయి. ఇలా మృత్యువాత పడిన తాబేళ్లు తీరానికి కొట్టుకు వస్తున్నాయి. విశాల సముద్ర తీరం కలిగిన శ్రీకాకుళం జిల్లాలో అక్కుపల్లి, నువ్వలరేవు, మంచినీళ్లపేట, చిన కొత్తూరు, కంబలరాయుడు పేట, రట్టి, భావనపాడు, గుణుపల్లి తదితర తీరాల్లో పదుల సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి దుర్వాసన రావడంతో మత్స్యకారులు తీరంలో గల ఇసుక తిన్నెలలో కప్పి పూడుస్తున్నారు.

సిక్కోల్.. చాలా కూల్!



- రాత్రివేళ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న జిల్లా వాసులు
- ప్రస్తుతం పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటు చేసుకోవడంతో చలితీవ్రత పెరిగింది.

ఆమదాలవలస రూరల్: సిక్కోలు కూల్‌కూల్‌గా మారిపోయింది. చీకటి పడితే చాలు ఉష్ణోగ్రతలు పడిపోయి చలి వణికించేస్తోంది. ఉన్నట్టుండి వాతావరణం చల్లగా మారిపోవడంతో జిల్లా ప్రజలు గజగజలాడుతున్నారు. సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నట్టుండి పడిపోవడం వల్ల చలి తీవ్రత పెరిగిందని జిల్లా ఏరువాక కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జె.జగన్నాథం 'సాక్షి'కి ఆదివారం తెలియజేశారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం కావడంతో సాయంత్రం నాలుగు దాటితే బయటకు వెళ్లేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. ఉదయం కూడా తొమ్మిదింటి వరకు చలి తీవ్రత తగ్గడం లేదు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలు చూస్తే రాత్రి వేళ 9 డిగ్రీలు, పగటి పూట 25 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.
- నాలుగు రోజుల కిందట సాధారణం కంటే రాత్రి ఉష్ణోగ్రతలు ఆరు డిగ్రీల వరకు అధికంగా రికార్డయ్యేవి. దీంతో చలి తీవ్రత పెద్దగా కనిపించేది కాదు.
- రోజుకు 6 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల చలి ఎక్కువగా కనిపిస్తుంది.
- చలి తీవ్రత లేక ముందు సముద్ర తీరాల్లో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల చలిగాలులు వీయలేదు. ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉండటం వల్ల చలి సాధారణంగానే ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.
- రెండు రోజులుగా ఉత్తర దిశల నుంచి గాలులు వీయడం వల్ల చలి గాలులు బాగా వస్తున్నాయి. రానురానూ ఉత్తర గాలులు పెరగడం వల్ల చలి తీవ్రత వారం రోజులపాటు ఇలాగే కొనసాగుతుందని వివరించారు.

చలి ఎక్కువే



గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది చలి కాస్త ఎక్కువగా ఉంటుంది. వాస్తవ పరిస్థితుల బట్టి చూస్తే శీతాకాలంలో చలి తీవ్రత ఉండడం వల్ల వాతావరణం అనుకూలంగా మారుతుంది. చలి లేకపోతే భవిష్యత్‌లో వాతావరణంలో వ్యతిరేక పరిస్థితులు ఎదురవుతాయి. చలి తీవ్రత లేకపోతే వర్షాకాలంలో వర్షాలపై వాటి ప్రభావం చూపి అల్పపీడన ద్రోణులు ఏర్పడతాయి. ఈ ఏడాది శీతాకాలంలో ఉండాల్సిన చలి తీవ్రత అనుకున్న స్థాయిలోనే ఉన్నాయి. చలి తీవ్రతను తట్టుకోవడానికి ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. – డాక్టర్ జె.జగన్నాథం, ఏరువాక కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఆమదాలవలస

గత ఏడాది కంటే ఎక్కువే..

గత ఏడాదితో చలి తీవ్రత పోల్చి చూసుకుంటే ఈ ఏడాది కాస్త ఎక్కువగానే చలి ఉంది. గత ఏడాది జనవరి 8న రాత్రి ఉష్ణోగ్రత 17, పగటి ఉష్ణోగ్రత 31 డిగ్రీలు ఉండగా ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రత 9, పగటి ఉష్ణోగ్రత 25గా నమోదైంది. ఈ ఏడాది జనవరి నెలలో రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 9 నుంచి 14 డిగ్రీల మధ్య కొనసాగడం వల్ల చలి యథావిధిగా కొనసాగుతుంది. గత నెలలో తుఫాన్ కారణంగా భూమట్టంలో తగిన రీతిలో నీటికుంటలు ఉండి నీటి నిల్వలు సమృద్ధిగా ఉండడం వల్ల భూమి తేమగాలి పీల్చుకోవడంతో చలి పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాత్రి వేళ మంచు దట్టంగా కురవడం వల్ల భూమికి సూర్యకిరణాలు తక్కువగా రావడంతో ఉష్ణోగ్రతల్లో తగ్గుదలలు ఏర్పడుతున్నాయి. సముద్రం వైపు నుంచి గాలులు వీస్తే ఉష్ణోగ్రతల్లో పెరుగుదల వచ్చి చలి తీవ్రత తగ్గుతుంది. చలి తీవ్రత ఉన్నంతకాలం జిల్లాలో వర్షాలు పడే అవకాశాలు లేవు. దట్టంగా కురుస్తున్న పొగమంచు కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆస్తమా, గుండెజబ్బు రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

'ఫేషియల్ యాప్‌పై తప్పుడు ప్రచారం తగదు'



పీఆర్‌టీయూ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: కొంతమంది కావాలనే పనిగట్టుకుని ఫేషియల్ (ముఖ ఆధారిత) యాప్ అటెండెన్స్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అదెంతమాత్రం తగదని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. తాను సీఎంతో ప్రత్యక్షంగా భేటీ అయి మాట్లాడిన తర్వాతనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి స్పష్టత వచ్చిందని ఆయన చెప్పారు. శ్రీకాకుళంలోని మండలవీధిలో ఆదివారం జరిగిన పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంతోపాటు 2023 డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కోవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టలేదని, మళ్లీ కొత్త వేరియెంట్ విజృంభిస్తున్న తరుణంలో ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ బయోమెట్రిక్ హాజరుకు పూర్తిగా స్వస్తి పలకాలని సీఎం జగన్ నిర్ణయించారే తప్ప ఉద్యోగ, ఉపాధ్యాయులను ఇబ్బందులపాలు చేయాలని ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. 'అయినా.. విధులకు హాజరుకావడమనేది ఉద్యోగ విధి నిర్వహనలో భాగం కాదా..! అంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఏమున్నాయి' అని ప్రశ్నించారు. విద్యాశాఖకే పరిమితమైన ఫేషియల్ అటెండెన్స్ యాప్‌ను నేడు అన్ని శాఖలకు రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తీసుకొస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానాన్ని రద్దుచేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. పాత పెన్షన్ విధానం అమలుపై సమాలోచనలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఇన్ని మంచి పనులు చేస్తుంటే ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎందుకు అభినందించలేకపోతున్నారని ప్రశ్నించారు. బయట మార్కెట్‌లో రూ.60వేల విలువ చేసే బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందించే కార్యక్రమం మహోన్నతమైనదని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్, గౌరవాధ్యక్షుడు జె.బాబూరావు, కార్యదర్శి డి.కేశవరావు, రాష్ట్ర సహాధ్యక్షుడు పప్పల రాజశేఖర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భైరి అప్పారావు, ఇందిర, మాధవరావు, గోపీచంద్, తిరుమలరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే బిల్లుల నిలుపుదల



పీఆర్ అధికారులతో సమీక్షిస్తున్న స్టేట్ పీఆర్ ఇంజినీరింగ్ చీఫ్ బాలూనాయక్

కోటబొమ్మాళి: ఈ ఏడాది చేపట్టిన పనులపై ప్రగతి నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సకాలంలో అందించాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం ఉంటే బిల్లులు నిలుపుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ చీఫ్ బాలూనాయక్ అన్నారు. ఆయన ఆదివారం కోటబొమ్మాళిలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్ఆర్ఈజీసీ, నాబార్డ్, ఏఐఐ నిధులతో ఇప్పటివరకూ జరుగుతున్న రోడ్లు, భవనాల నిర్మాణాలపై నాణ్యత పరిశీలనలు చేసి వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేయడానికి ఎస్ఈలు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పీఆర్ ఎస్ఈ వి.సత్యనారాయణ, విజయనగరం ఎస్ఈ గుప్తా, మన్యం జిల్లా ఎస్ఈ కృష్ణాజీ, డీఈ గిరిధర్, ఏఈ రెడ్డి సత్యనారాయణ, సర్పంచ్ గురువెల్లి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

30 మంది యువకుల రక్తదానం



21 సార్లు రక్తదానం చేసిన సాగర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కాశీబుగ్గ: పలాస మండలం సున్నాదేవి గ్రామం జాతీయ రహదారి పక్కన ఆదివారం గ్రామస్తులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు హాజరై ప్రారంభించారు. ఇందులో సుమారు 30 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే 21 సార్లు రక్తదానం చేసిన మాకన్నపల్లి గ్రామానికి చెందిన యువకుడు రాపాక సాగర్‌ను సత్కరించారు.

కన్నులపండుగ




స్థానిక దేశవానిపేటలోని బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. భోగి మంటలు, హరిదాసు వేషధారణలతో అలరించారు. – నరసన్నపేట

ఆ గురుతులు పదిలం

- ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తి
- సిక్కోలు గుండెలో భద్రంగా నాటి జ్ఞాపకాలు
- ఇచ్ఛాపురంలోనే యాత్ర ముగింపు

ఇచ్ఛాపురం రూరల్: సరిగ్గా నాలుగేళ్ల కిందట.. ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద.. అశేష జన సందోహం ఓ చారిత్రక ఘట్టానికి సాక్షిగా నిలిచింది. 3,648 కిలోమీటర్ల మేర 341 రోజుల పాటు సాగిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ఆఖరి అడుగు లొద్దపుట్టిలో పడింది. ఆ అడుగే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పునాదిని పటిష్టం చేసింది. నాలుగేళ్లయినా ఆ జ్ఞాపకాలు సిక్కోలు గుండెల్లో ఇంకా పచ్చగా మెదులుతున్నాయి.

ఒక్కడిగా మొదలై.. ఒక్కొక్కరిని కలుపుకుంటూ.. ఉప నదులు తోడైన మహానదిలా రాష్ట్రమంతా సాగిన ఈ పాదయాత్ర చరిత్రలో మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. 13 జిల్లాలు, 134 నియోజకవర్గాలు, 231 మండలాలు, 54 మున్సిపాలిటీలు, 8 కార్పొరేషన్లు, 2,516 గ్రామాల గుండా సాగిన పాదయాత్ర ఆఖరి ఘట్టంలో వైఎస్ జగన్ చేసిన ప్రసంగం ఇంకా చాలా మందికి గుర్తుంది. నేడు అందరితో ప్రశంసలు పొందుతున్న నవరత్నాలను ఆనాడే వైఎస్ జగన్ వివరించారు. పాదయాత్రలో చూసిన కష్టాలతోనే సంక్షేమ పథకాలకు ఊపిరి పోశారు. ఈ యాత్ర ఇచ్చిన సత్తువతోనే జనం గుండెల్లో స్థానాన్ని పదిలం చేసుకున్నారు. యాత్ర ముగింపునకు గుర్తుగా ఇచ్ఛాపురంలో విజయ స్థూపం కూడా ఏర్పాటు చేశారు. ఇది ప్పుడు మంచి పర్యాటక స్థలంగా పేరు పొందింది.



కోట్ల హృదయాలను గెలుచుకున్నారు



ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు సాగిన ప్రజా సంకల్పయాత్రలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్నారు. ముఖ్యంగా ఆయన ప్రజల కష్టాలను నేరుగా చూడటంతో అవి తీర్చడానికే హామీలిచ్చి 97 శాతం నెరవేర్చారు. ఆయనతో అడుగులు కలపడం అదృష్టంగా భావిస్తున్నాను. రానున్న ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని జగనన్నకు కానుకగా ఇస్తాం.

– పిరియా సాయిరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఇచ్ఛాపురం

ఆ చెమట చుక్కే అభివృద్ధికి చుక్కాని



ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిందించిన చెమట చుక్కలన్నీ రాష్ట్రాభివృద్ధికి చుక్కానిలయ్యాయి. ఓ సమర్థుడైన పాలకుడి పాలన కోసం ఎదురు చూసిన కోట్లాది మంది ప్రజల కలలను నిజం చేస్తూ ఆయన సంక్షేమ పాలన సాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఇచ్ఛాపురంలో పడిన జగనన్న అడుగుల చప్పుళ్లు, ఇచ్చిన హామీలు, నెరవేర్చిన వైనాలు సిక్కోలు ప్రజలు ఎప్పటికీ తమ గుండెల్లో పదిలంగానే ఉంటాయి.

– పిరియా విజయ, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్, శ్రీకాకుళం

కలలో కూడా ఊహించని అవకాశం

ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి బడుగు, బలహీన వర్గాలకు అత్యున్నత స్థానాలు ఇవ్వలేదు. తన క్యాబినెట్‌లో దళితులకు ఉన్నత పదవులు ఇచ్చిన జగనన్న ఇచ్ఛాపురం శివారు ప్రాంతంలో నన్ను డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. నాకు ఈ అవకాశం వస్తుందని కలలోనైనా అనుకోలేదు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి, నా లాంటి వందలాది మందిని అందలమెక్కించారు.

–ఎస్.సుగుణ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్

విజయ స్థూపం

రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు.. పలు రైళ్లు రద్దు

ఆమదాలవలస: ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో తిలారు-ఉర్లాం, నౌపడ-కోటబొమ్మాళి స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ మరమ్మతులతో పాటు ఆయా కేంద్రాల్లో అండర్ టన్నెల్ నిర్మాణాల కారణంగా సోమవారం శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం- బరంపురం ఎక్స్‌ప్రెస్(18526), బరంపూర్- విశాఖపట్నం (18525), విశాఖపట్నం-భువనేశ్వర్(22820), భువనేశ్వర్ -విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (22819), విశాఖపట్నం -గుణుపూర్ పాసింజర్(08522), గుణుపూర్ – విశాఖపట్నం పాసింజర్(08521), విశాఖపట్నం -పలాస పాసింజర్(08532), పలాస-విశాఖపట్నం పాసింజర్(08531) రద్దు చేసినట్లు ప్రకటించారు. వీటితో పాటు పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తాయని, ప్రయాణికులు గమనించాలని తెలిపారు.

ఆర్టీసీకి పండగ

- సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- నేటి నుంచి 14వ తేదీ వరకు అదనపు బస్సులు
- తిరుగు ప్రయాణానికి కూడా ఏర్పాట్లు
- ఇరువైపులా టికెట్ తీసుకుంటే 10శాతం రాయితీ
- ప్రత్యేక సర్వీసులన్నింటికీ యథావిధిగా చార్జీలు



శ్రీకాకుళం అర్బన్:

ఆర్టీసీలో పండగ కళ కనిపిస్తోంది. సంక్రాంతికి వలస పక్షులు సొంతూళ్లకు వస్తున్న నేపథ్యంలో వారి రాకపోకలకు వీలుగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. ఈ ప్రత్యేక బస్సులకు ఎలాంటి అదనపు రుసుం వసూలు చేయకుండా సింగిల్ ఫేర్(యథావిధి చార్జీలు)తోనే నడపనున్నారు. జిల్లా నుంచి వలసలు ఎక్కువగానే ఉంటాయి. వీరంతా పండగ సమయంలో ఊళ్లకు వస్తారు. వీరి కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

అదనపు బస్సులు

- సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాకు చేరుకునే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 8వ తేదీ నుంచి ఆర్టీసీ అధికారులు అదనంగా 40 బస్సులను నడపనున్నారు.
- 8న హైదరాబాద్ నుంచి ఒక ప్రత్యేక బస్సు, 10వ తేదీన ఒక బస్సు, 11న 5బస్సులు, 12న 8 బస్సులు, 13వ తేదీన 4 బస్సులు మొత్తంగా 19 బస్సులు జిల్లాకు చేరుకోనున్నాయి.
- విజయవాడ నుంచి శ్రీకాకుళంకు ప్రతి రోజూ యథావిధిగా తిరిగే 9 బస్సులను నడుపుతున్నారు.
- రాజమండ్రి నుంచి శ్రీకాకుళంకు 6 సర్వీసులు, రావులపాలెం నుంచి 1, అమలాపురం నుంచి 2, కాకినాడ, భద్రాచలంకు ఒక్కో బస్సు చొప్పున రెగ్యులర్‌గా తిరిగేవి అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు ఆయా ప్రాంతాల నుంచి కూడా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.
- శ్రీకాకుళం జిల్లాకు విశాఖపట్టణం నుంచే ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇందు కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి ప్రతిరోజూ 45 నాన్ స్టాప్‌లుగా అల్ట్రా డీలక్స్ బస్సులు, పల్లెవెలుగు బస్సులు తిరుగుతున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 10వ తేదీ, 11, 12, 13, 14వ తేదీ వరకూ విశాఖపట్టణం నుంచి శ్రీకాకుళంకు ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకూ ప్రతి 10నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడపనున్నారు. అలాగే రాత్రి 9గంటల తర్వాత ప్రతి గంటకూ ఒక బస్సు చొప్పున ఆర్టీసీ బస్సు నడపనున్నారు. రద్దీని బట్టి అదనపు బస్సులు కూడా నడుపుతారు.

సింగిల్ ఫేర్ మాత్రమే

సంక్రాంతి పండగను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం వేయకుండా యథావిధి చార్జీలతో సర్వీసులు నడపనుండడం గమనార్హం. గతంలో దసరా, సంక్రాంతి పండగల సందర్భంగా ఆర్టీసీ నడిపే అదనపు బస్సుల్లో వన్ అండ్ హాఫ్ ఫేర్(ఒకటిన్నర చార్జీ)తో నడిపేవారు. అయితే ఈ ఏడాది మాత్రం పండగ సందర్భంగా నడిపే అదనపు బస్సుల్లో సింగిల్‌ఫేర్‌తోనే ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. పైగా రాయితీలతో కూడిన పథకాలను కూడా ప్రవేశపెట్టడం జరిగింది. గతంలో ఆర్టీసీ ఏసీ బస్సులకు మాత్రమే రాయితీ ఉండేది. ఈదఫా ఏసీ, సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్ వంటి సర్వీసులకు రాను, పోను ఒకేసారి టికెట్ తీసుకుంటే ప్రయాణ చార్జీలో 10శాతం రాయితీ కల్పిస్తున్నారు. ఈ–వాలెట్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే 5శాతం రాయితీ ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. విశాఖపట్టణం నుంచి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ఉండేలా చర్యలు తీసుకున్నాం. జిల్లాలో కూడా మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

– ఎ.విజయ్‌కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి

క్లుప్తంగా

విదేశంలో చిక్కుకున్న భర్తను విడిపించాలని వినతి



ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు విన్నవిస్తున్న పద్మశ్రీ

టెక్కలి: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి అక్కడ జరిగిన పరిణామాలతో జైల్లో చిక్కుకున్న తన భర్తను విడిపించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని టెక్కలి మండలం జయకృష్ణాపురం గ్రామానికి చెందిన సత్తారు పద్మశ్రీ అనే మహిళ ఆదివారం టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను కోరారు. మర్చంట్ నేవీలో పనిచేస్తున్న తన భర్త సత్తారు మహేశ్వరరావు ఆఫ్రికా ఖండం సెనగల్ దేశంలో అన్యాయంగా జైల్లో చిక్కుకున్నారని వాపోయారు. అనంతరం ఎమ్మెల్సీ స్పందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీకు వినతిపత్రం ఇచ్చిన వారిలో వైస్ ఎంపీపీ పి.రమేష్, జయకృష్ణాపురం గ్రామానికి చెందిన సత్తారు పాపారావు, ఎస్.గణపతిరావు, ఎస్.లక్ష్మీపతి, ఎస్.ఆనందరావు, ఎస్.మన్మథరావు, హేమసుందర్, సింహాచలం తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని నెల్లూరు వీధికి చెందిన డి.స్వాతి అనే వివాహిత ఆదివారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కుటుంబ తగాదా కారణంగా మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న ఆలౌట్ దోమల మందును తాగింది. అనంతరం నేరుగా టెక్కలి పోలీసుస్టేషన్‌కు వెళ్లడంతో ఎస్ఐ రామకృష్ణ వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. బాధితురాలి నుంచి పూర్తి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మృతిచెందిన నెయ్యల చిన్నారావు

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారిపై శ్రీపురం మార్కెట్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసకు చెందిన కూరగాయల వ్యాపారి నెయ్యల చిన్నారావు(56) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నారావు ఆదివారం మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా నరసన్నపేట వైపు నుంచి టెక్కలి వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు సంతోష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు హెచ్‌సీ లక్ష్మణ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని..



యర్రంనాయుడు మృతదేహం

సరుబుజ్జిలి: పురుషోత్తపురంలోని మండలమ్మతల్లి పేరంటాలు ఆలయం సమీపంలో ఆదివారం ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో గుత్తావల్లి గ్రామానికి చెందిన బొడ్డేపల్లి యర్రంనాయుడు(58) మృతి చెందాడు. ఈయనకు భార్య జయలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యర్రంనాయుడు తన మేనమామతో కలిసి పురుషోత్తపురంలో ఉన్న చెల్లిని పండగకు పిలిచి తిరుగు ప్రయాణంలో రొట్టవలస వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా చిప్స్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో యర్రంనాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మేనమామ చింతాడ పార్వతీశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	54,930-00
బంగారం(22కే. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

పెరటికోళ్ల పెంపకంతో..

అదనపు ఆదాయం



శ్రీకాకుళంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

- జీవనోపాధులు పథకంలో భాగంగా మహిళలకు పెరటికోళ్ల యూనిట్లు
- జిల్లాలో 2500 యూనిట్ల సరఫరా లక్ష్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పలు పథకాలు అమలు చేస్తోంది. స్వయం శక్తి సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, చేదోడు, చేయూత వంటి పథకాలతో అండగా నిలుస్తోంది. తాజాగా జీవనోపాధులు పథకంలో భాగంగా పెరటి కోళ్లు, గొర్రెలు, ఆవులు వంటివి అందజేసి వారికి స్థిరమైన ఆదాయం కలిగించే చర్యలు చేపడుతోంది. పెరటికోళ్ల పెంపకం ద్వారా గుడ్లు, మాంసం, కోళ్ల అమ్మకాలు చేపట్టి తద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటోంది.

2500 యూనిట్ల లక్ష్యం..

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 2500 యూనిట్ల పెరటికోళ్ల పంపిణీ లక్ష్యంగా తీసుకున్నారు. ప్రతి మండలంలోనూ తొలి విడతగా 100 యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటివరకు 436 యూనిట్లు(పలాస-47, వజ్రపుకొత్తూరు-47, సోంపేట-50, గార-47, రణస్థలం-48, ఎచ్చెర్ల -49, నరసన్నపేట-50, శ్రీకాకుళం-73, జలుమూరు-25) పంపిణీ పూర్తి చేశారు.

యూనిట్ ధర ఇలా....

మహిళా స్వయం శక్తి సంఘాలు, రైతు సంఘాల సభ్యుల పెరటి కోళ్ల యూనిట్ పొందేందుకు అర్హులు. కోళ్లతో పాటు మేత, మందులు, పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తారు. యూనిట్‌లో 8 కోడిపెట్టలు, 3 పుంజులు, 30 కేజీల దాణా, మెడికల్ కిట్, రవాణా కోసం అట్ట పెట్టె అందజేస్తారు. కనీసం 14 వారాల నుంచి 19వారాల వయస్సు కోళ్లను అందజేస్తారు. ఒక్కొక్క కోడి కనీసం 1000-1200 గ్రాముల బరువు కలిగి ఉంటుంది. కొనుగోలు చేయడానికి ముందే వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయాలి. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన శ్రీ ప్రియాంకా ఆగ్రో ఫార్మర్స్ సంస్థ ఆశీల్ బ్రీడ్‌కు చెందిన పెరటి కోళ్లను అందజేస్తున్నారు. ఒక్కో యూనిట్‌ను రూ.3970కు సరఫరా చేస్తున్నారు.

సుస్థిర ఆదాయం..

- పెరటి కోళ్ల పెంపకం వల్ల మాంసకృత్తులు అధికంగా లభించే గుడ్లు, మాంసం అందుబాటులో ఉంటుంది. ఇంటి వద్ద వినియోగించడంతో పాటు వ్యాపారపరంగా కూడా ఎదగవచ్చు.
- గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల పోషకాహార లోపం నివారించేందుకు గుడ్డు ఎంతగానో ఉపయోగపడుతోంది. వీటి విక్రయాల ద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చు.
- సభ్యురాలు చేస్తున్న ప్రస్తుత జీవనోపాధికి అదనపు జీవనోపాధి కలుగుతోంది. కోళ్లు పెంచడానికి నైపుణ్యం అవసరం లేదు. కొంచెం జాగ్రత్తలు తీసుకుంటే చాలు.
- ఒక కోడి పెట్ట సుమారుగా 19వ వారము వయసు నుంచి 80 వారాల వరకు గుడ్లు పెడుతుంది. ఒక్కో కోడి సగటున 60 గుడ్లు పెడుతుంది. యూనిట్‌కు 480 వరకు గుడ్ల ఉత్పత్తి జరుగుతుంది. మార్కెట్‌లో నాటుకోడి గుడ్డు ధర రూ.7కు పైనే పలుకుతోంది. వీటి ద్వారా రూ.3,360 వరకు ఆదాయం లభిస్తుంది. మాంసం కిలో ధర రూ.400 వరకు ఉంది. వీటి మాంసం ధర రూ.8800 వరకు ఆదాయం వస్తుంది. ఇలా ఒక యూనిట్‌కి సగటున రూ.12,160 వరకు ఆదాయం పొందవచ్చు.

అదనపు ఆదాయం..

మహిళలు ప్రస్తుతం ఉన్న జీవనోపాధులతో పాటు పెరటికోళ్ల పెంపకం, గుడ్లు అమ్మకం వంటివి చేస్తే, అదనపు శ్రమ, శిక్షణ వంటివి లేకుండా అదనపు ఆదాయం పొందవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెరటికోళ్ల పెంపకం లాభదాయకం. నాటుకోళ్లకు, గుడ్లకు మార్కెట్‌లో గిరాకీ ఉంది. పెరటికోళ్ల యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: రైతు సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం తొగరాం సమీపంలో నారాయణపురం సాగునీటి కాలువకు అనుసంధానంగా ఉన్న దూసి చానెల్‌పై రూ.83.10 లక్షలతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం అధ్యక్షతన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా, అన్నదాతల కష్టాలను చూసి సాగునీటి కాలువపై వంతెన నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయగా త్వరితగతిన ఆమోదం లభించినట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో రైతుల కష్టాలు తొలగించేందుకే ఈ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తొగరాంతో వీడదీయరాని అనుబంధం ఉందన్నారు. గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి రైతులకు నిరంతరం భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు మెట్ట ఆనందరావు, గురుగుబెల్లి నీలారావు, చిగురుపల్లి దశరథ, గొంటి కృష్ణ, సోమరాజు తేజేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, ఏఈఈ కొత్తకోట రాంబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

- విగ్రహావిష్కరణలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విక్టర్ ప్రసాద్

కంచిలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అందరివాడని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎస్.విక్టర్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రం కంచిలిలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో గురుకుల పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని, కళావేదికలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాలకు సరిపడా న్యాయం చేస్తూ రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. అనంతరం విక్టర్ ప్రసాద్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు, పలాస ఆర్‌డీఓ టి.సీతారామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, తహసీల్దార్ ఎస్.హైమావతి, ఎంపీడీఓ చల్లా శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే తూర్పుకాపుల అభివృద్ధి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యేలు రెడ్డిశాంతి, కిరణ్, ఎమ్మెల్సీ విక్రాంత్
- సామాజిక భవన నిర్మాణానికి రూ.కోటి విరాళం ప్రకటించిన పల్సస్ సీఈఓ గేదెల శ్రీనుబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపులంతా ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఆదివారం తూర్పుకాపుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తూర్పు కాపు సామాజిక వర్గ అభివృద్ధే అజెండాగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. సంఘం అభివృద్ధికి, సామాజిక భవన్ నిర్మాణానికి రాజకీయాలకు అతీతంగా సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి పల్సస్ సంస్థ సీఈఓ గేదెల శ్రీనుబాబు రూ.కోటి విరాళం ప్రకటించారు. డోల జగన్, డోల తిరుమలరావు, లంక ఫ్యామిలీ తదితరులు లక్షకు పైగా విరాళాలు ప్రకటించారు. స్థలం ఎక్కడనేది నిర్ణయించాక భవన నిర్మాణం పూర్తిచేసేందుకు అనేక మంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అంతకుముందు మాజీమంత్రి దివంగత గొర్లె శ్రీరాములునాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్యే ఎం.నీలకంఠంనాయుడు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మాజీ చైర్మన్ డోల జగన్, పిసిని చంద్రమోహన్‌రావు, ఎం.వి.స్వరూప్, సురంగి మోహనరావు, మామిడి గోవిందరావు, వావిలపల్లి జగన్నాదంనాయుడు, తూర్పుకాపు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కిల్లారి నారాయణరావు, ఎం.రామజోగి నాయుడు,అంకడాల తవిటన్న, పి.తమ్మినాయుడు,న్యాయవాది ఎల్.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోరు



బహుమతులు అందుకున్న క్రీడాకారులతో నిర్వాహకులు, అతిథులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా మాస్టర్స్ (35ఏళ్లు పైబడినవారికి) బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఈ పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఆర్.రాజేంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాస్టర్స్ షట్లర్స్ కోసం టోర్నీ నిర్వహించడం ఇదే తొలిసారని అన్నారు. ఏపీబీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ మాట్లాడుతు బ్యాడ్మింటన్ అభివృద్ధికి సమష్టిగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. విజేతలకు అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈఓ సంపతిరావు సూరిబాబు, సంయుక్త కార్యదర్శి గురుగుబెల్లి ప్రసాద్, టి.తారకేశ్వరరావు, చల్లా రమేష్, గేదెల మోహనరావు, మనోహర్, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు

- అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్

వజ్రపుకొత్తూరు రూరల్: ఐక్యమత్యంతో ముందుకు సాగితేనే సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగగలమని అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్ అన్నారు. పెద మురహరిపురంలో ఆదివారం జిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడు గొరకల వసంతరావు అధ్యక్షతన వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు తమకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అంతకు ముందు ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా, మండల స్థాయి కార్యవర్గ నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ముని స్వామికృష్ణ, తాడి దుర్గాప్రసాద్, గేదెల ప్రకాశ్, మడియా రామకృష్ణ, రెయ్యి కోదండకృష్ణ, వర్మ, పి.శ్రీరాములు, దుమ్ము లక్ష్మణరావు, యలమంచిలి భాస్కరరావు, పుచ్చ నాయకన్న, అంగ అప్పన్న స్వామి, బి.వైకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పేరిట మోసం



న్యాయం చేయాలని కోరుతున్న రైతు కృష్ణారావు

మందస: నిర్లక్ష్యరాస్యత అడ్డుపెట్టుకుని ఓ రైతుకు అన్యాయం చేశారు. మందస మండలం సొండిపూడి గ్రామానికి చెందిన గుమ్మడి కృష్ణారావు పేరిట 1.45 ఎకరాలు సొండిపూడి పరిధిలో ఉంది. ఖరీఫ్ ధాన్యం రైతు భరోసా కేంద్రానికి ఇవ్వడానికి వెళ్లగా.. 32 బస్తాలు తీసుకుంటామని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మోహనరావు చెప్పారు. రెండు రోజుల అనంతరం ఓ దళారి పేరిట ధాన్యాన్ని మీ ఖాతాలో తీసుకున్నామని, బ్యాంక్‌లో నగదు జమ కాగానే ఇవ్వాలని ఆర్బీకే సిబ్బంది చెప్పడంతో కృష్ణారావు నివ్వెరపోయాడు. పొలంలో ఉన్న ధాన్యాన్ని ఎలా రక్షించుకోవాలో సతమతమవుతుండగా.. తన ఆధార్‌తో వేరొకరి ధాన్యం తీసుకుని, డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో ఆశ్చర్యపోయాడు. జరిగిన మోసాన్ని వైఎస్సార్ సీపీ నాయకురాలు, సర్పంచ్ చిచ్చుల నళిని, శ్రీనివాసరావులకు చెప్పాడు. వారిద్దరితో కలిసి ఆర్బీకేకు వెళ్లి ఆరా తీయగా.. దళారులతో సిబ్బంది కుమ్మక్కై కృష్ణారావును మోసం చేశారని తేలింది. విషయం బయటకు పొక్కడంతో దళారి వచ్చి.. 80 కిలోల బస్తాకు మరో మూడు నుంచి 5 కిలోలు ఎక్కువగా ఇస్తే తీసుకుంటానని చెప్పడంతో సర్పంచ్, పార్టీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు స్పందనలో కూడా ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు. ఈ విషయమై వీఏఏ మోహనరావు వద్ద ప్రస్తావించగా.. షెడ్యూలింగ్ తానే చేశానని, దళారీ వ్యవస్థను మాత్రం ప్రోత్సహించడం లేదన్నారు. కంప్యూటరీకరణ డీఈఓ విజయ్ చేశారన్నారు. కాగా, తనకు జరిగిన అన్యాయంపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధిత రైతు కృష్ణారావు కోరుతున్నారు.

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం ఇదే

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ సహకారంతో శ్రీకాకుళం జిల్లాలో అథ్లెటిక్స్‌కు మరింత ఆదరణ తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు (వాసు) అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారులుగా వై.పోలినాయుడు, కె.రాజారావు వ్యవహరించగా, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.హైమ, శాప్ ప్రతినిధి పీఎస్ మణికుమార్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి పి.సుందరరావు పరిశీలకులుగా హాజరయ్యారు. కాగా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు మూడు సార్లు జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించిన కొన్న వెంకటేశ్వరరావు, మూడు దశాబ్దాలుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన నౌపడ విజయ్‌కుమార్‌లు స్వచ్ఛందంగా తప్పుకోవడంతో వారికి అసోసియేషన్‌లో చైర్మన్‌గా, ముఖ్య సలహాదారునిగా సముచిత స్థానాలు అప్పగించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. అథ్లెటిక్స్ క్రీడాభివృద్ధికి సమష్టిగా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి ఎ.రాఘవేంద్ర, నాగేశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ సంఘ కార్యవర్గం ఇదే..

చైర్మన్‌గా కొన్న వెంకటేశ్వరరావు(వాసు), ముఖ్య సలహాదారుగా నౌపడ విజయ్‌కుమార్, ప్యాట్రన్లగా ఎండీ కాసీంఖాన్, పాలకొండ అప్పారావు, అధ్యక్షునిగా కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శిగా మెంటాడ సాంబమూర్తి, కోశాధికారిగా వాండ్రంగి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కె.హరిబాబు, పి.తవిటయ్య, కె.పద్మనాభరెడ్డి, కె.గోపి, ఎం.కామయ్య, సంయుక్త కార్యదర్శులుగా బి.వి.రమణ, కె.మాధవరావు, బి.నారాయణరావు, ఎస్.అరుణ, టి.శ్రీనివాసరావు, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్స్‌గా వి.మురళి, ఎస్‌వి.జోగారావు, కె.రఘునాథరావు, అసోసియేట్ జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్ పద్మలోచన, ఎ.గోవిందరావు, పి.సునీత, వి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా ఎం.ఆనంద్‌కిరణ్, ఎండి వజీర్, ఎస్.లక్ష్మణరావు, టి.ఆనందరావు, జి.సుజాత, జి.రామరాజు, ఎస్.చంద్రశేఖర్, ఆర్ఆర్ మహంతి, బి.రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత బియ్యంతో భరోసా



రేషన్ వాహనం ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

- జిల్లాలో 6,61,818 కుటుంబాలకు లబ్ధి
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం

కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పథకంతో బడుగులకు భరోసా కల్పిస్తోంది. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకూ ప్రతి నెలా ఉచితంగా రేషన్ బియ్యాన్ని అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. గతంలో కిలో బియ్యానికి రూపాయి చొప్పున వసూలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లావ్యాప్తంగా 6 లక్షల 61 వేల 818 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. జిల్లాలో 6,61,818 రేషన్‌కార్డులుండగా అందులో 19,50,353 మంది సభ్యులు (యూనిట్లు)గా ఉన్నారు. ప్రతి యూనిట్‌కు ఐదు కేజీలు చొప్పున బియ్యం మంజూరు చేశారు. జిల్లావ్యాప్తంగా1603 రేషన్ డిపోలు, 422 రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చురుగ్గా సాగుతోంది. ఈ నెలలో కొత్తగా 3510 రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. వీటితో పాటు పింఛన్లసొమ్ము పెంపు కూడా చేపట్టడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

బలహీనవర్గాలకు మేలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా 6,61,818 కుటుంబాలకు బియ్యం పంపిణీని జనవరి 1 నుంచి ప్రారంభించాం. గతంలో కిలో రూపాయి చొప్పున్న చెల్లించాల్సిందేది. జనవరి నుంచి ఉచితంగానే అందజేస్తున్నాం. ఈ పథకంతో బలహీనవర్గాలకు మేలు జరగనుంది. పథకం పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– టి.వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి, శ్రీకాకుళం